ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 176

సోమవారం 30 డిసెంబర్ 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD


## ఫుల్ రష్‌తో గుట్ట కిటకిట...!!




యాదగిరిగుట్టలో నిత్య పూజల సందడి

- ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం
- ఆదివారం ఆలయానికి రూ.56.23 లక్షల ఆదాయం

## ఘోర విమాన ప్రమాదం

# 179 మంది దుర్మరణం

- దక్షిణ కొరియాలోని మువాన్ అంతర్జాతీయ విమానశ్రయంలో ఘటన
- గోడను ఢీకొట్టడంతోనే ప్రమాదం



సియోల్: దక్షిణ కొరియాలో విమాన ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ప్రమాదం కారణంగా విమానంలో ప్రయాణిస్తున్న 179 మంది దుర్మరణం చెందారు. కేవలం ఇద్దరు విమాన సిబ్బంది మాత్రమే పాణాలతో బయటపడ్డారు. విమానాశ్రయంలో ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన దక్షిణ కొరియాలోని మువాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. థాయ్ రాజధాని బ్యాంకాక్ నుంచి బయల్దేరిన ది జేజు ఎయిర్ ఫ్లైట్‌కు చెందిన 7%జ%2216 నంబర్ బోయింగ్ 737-800 శ్రేణి విమానం ల్యాండ్ అవుతూ అదుపుతప్పింది. ఈ క్రమంలో విమానాశ్రయంలోని గోడను

మిగతా 2 లో



02

## నేడు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

- మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలపనున్న సభ
- తెలంగాణ ఏర్పాటులో ఆయన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ నివాళి

# సాఫ్ట్ స్కిల్స్ నేర్పించే దిశగా చర్యలు తీసుకోండి

### అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



రైజింగ్ తెలంగాణ సాకారమవుతున్నది 02

- కన్హా శాంతివనం, రెయిన్ ఫారెస్ట్, మెడిటేషన్ సెంటర్ సందర్శన

హైదరాబాద్, రోమింగ్‌న్యూస్: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్ నేర్పించే దిశగా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా గ్రామంలోని కన్హా శాంతివనాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. అక్కడ చిన్నారులు, విద్యార్థులకు నేర్పించే సాఫ్ట్ స్కిల్స్ కు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2 లో



## హామీలు నెరవేరుస్తాం

- రైతు భరోసాకు కట్టుబడి ఉన్నాం
- బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు 72,659 కోట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

కేబినెట్‌సబ్‌కమిటీ భేటీలో కీలక నిర్ణయాలు

హైదరాబాద్, రోమింగ్‌న్యూస్: రైతు భరోసా ఇచ్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చిన ముందుకు వెళ్తామన్నారు. ఆదివారం సచివాలయంలో రైతు భరోసా సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సమావేశం అయ్యారు. రానున్న యాసంగి పంటకు

మిగతా 2 లో



03

## ఫీజు రీయంబర్స్ మెంట్ సంక్రాంతిలోపు చెల్లించాల్సిందే!

- 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి
- లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో మహోద్యమం చేస్తాం..
- కేంద్ర మంత్రి బండి సంజయ్

## అదుపులోనే శాంతిభద్రతలు

వ్యక్తిగత కారణాలతోనే పోలీసుల ఆత్మహత్యలు




- డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం
- ఈ యేడాది 2,34,158 కేసుల నమోదు
- డీజీపీ జితేందర్‌కీలక వ్యాఖ్యలు
- 2024 వార్షిక క్రైం రిపోర్టు విడుదల

02



03

## కేసీఆర్, కేటీఆర్‌ను ఇరికించింది హరీశ్ రావే

- ఓఆర్ఆర్ ఎపిసోడ్‌లో కూడా జైలుకి వెళ్తారు
- కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

## పోలీసుల మరణ మృదంగం..

ప్రభుత్వానికి పట్టింపు లేదా? ● మాజీ మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్, రోమింగ్‌న్యూస్: పోలీసుల ఆత్మహత్యలపై నిజానిజాలు వెలుగులోకి రావడానికి శాఖాపరమైన దర్యాప్తు చేయాలని తెలంగాణ డీజీపీని కోరుతున్నానని హరీశ్ రావు అన్నారు. తెలంగాణ సర్కారుపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పోలీసుల మరణ మృదంగం.. ప్రభుత్వానికి

మిగతా 3 లో

## పురుగుల మందు తాగి ఆపై ఉరి చేసుకొని..

బెటాలియన్ కానిస్టేబుల్‌బలవన్మరణం

- భార్యా, పిల్లలకు పురుగుల మందు తాగించి..
- అప్పుల బాధతోనే అఘాయిత్యం
- క్షేమంగా బయటపడ్డ కుటుంబం
- సిద్దిపేటలో విషాదం



02

## పోలీసుల నోటీసులకు సంధ్య థియేటర్ రిప్లై..

పోలీసులకు 6 పేజీల నివేదిక



హైదరాబాద్, రోమింగ్‌న్యూస్: పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై ఎట్టకేలకు థియేటర్ యాజమాన్యం స్పందించింది. చిక్కడపల్లి పోలీసుల షోకాజ్ నోటీసులకు

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
30 డిసెంబర్
2024







# ఘోర విమాన ప్రమాదం
# 179 మంది దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

ఢీకొని మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. విమానం ల్యాండ్ కావడానికి ప్రయత్నించిన సమయంలో ల్యాండింగ్ గేర్ సమస్యతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా విమానంలో ప్రయాణిస్తున్న 179 మంది మృతిచెందారు. ఇద్దరు సిబ్బంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. విమాన ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది విమానంలో ఉన్నారు. మృతులంతా దక్షిణ కొరియాకు చెందిన వారే ఉన్నట్టు సమాచారం. విమానం కేవలం ఇద్దరు థాయ్‌లాండ్‌కు చెందిన దేశస్తులే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ విమానం అప్పటికే ల్యాండింగ్‌కు యత్నించి విఫలమైందని అధికారులు పేర్కొన్నారు. ఇది నేల పైకి దిగిన తర్వాత రనేవే చివరికి వస్తున్న సమయంలో కూడా వేగాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైనట్లు చెప్పారు. ఇది ఎయిర్‌పోర్టు గోడను ఢీకొనడంతో విమానంలో నుంచి ఒక్కసారిగా మండిపోయి మంటలు వ్యాపించినట్లు తెలిపారు. దీంతో, ఎయిర్‌పోర్టు వద్ద దట్టమైన పొగ అలుముకుంది. ఈ విమాన ప్రమాదంపై తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ మోక్ స్పందించారు. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఇంటీరియర్, ల్యాండ్ మినిస్ట్రల్లకు, పోలీసులు, అగ్నిమాపక శాఖకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ ప్రమాదంతో మువాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని విమానాల రాకపోకలను రద్దు చేశారు.

# కొల్చారం హెచ్‌సీ ఆత్మహత్య

### అఫైర్‌పెట్టుకున్న మహిళ భర్త బెదిరింపులే కారణం?

**కొల్చారం, డిసెంబర్29:** మెదక్‌జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్(52) ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో పాత ఎస్‌ఐ క్వార్టర్స్ ముందు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎస్ లో రాత్రి షిఫ్టు డ్యూటీ ఉండగా, అది పూర్తి చేసుకొని, ఉదయం యథావిధిగా వాకింగ్ పూర్తిచేసుకునే స్థానిక బస్టాండ్ వద్ద ఓ హోటల్‌లో టిఫిన్ చేసి, చాయ్ తాగి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వచ్చాడని స్థానికులు తెలిపారు. కాగా ఈ లోపే తాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లుగా తన కూతురికి సమాచారం ఇచ్చి, ఉదయం 8 గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని సాయికుమార్ మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, మృతుడు సాయికుమార్ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన వాడు. 1992 బ్యాచ్ లో కానిస్టేబుల్ గా ఉద్యోగం పొంది వృత్తిరీత్యా మెదక్ జిల్లా నరసాపూర్ పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. సుమారు 6 ఏండ్ల నుండి హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ, నర్సాపూర్ కౌడిపల్లి ఠాణాల్లో పనిచేసి బదిలీపై సుమారు 20 నెలల క్రితం కొల్చారం పోలీస్ స్టేషన్ కు వచ్చారు. సాయికుమార్కు భార్య, వివాహం అయిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### వివాహేతర సంబంధమే కారణమా?

సాయికుమార్‌ఆత్మహత్యకు వివాహేతర సంబంధమే కారణమని పలువురు పేర్కొంటున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణంలో టిఫిన్ సెంటర్ నడుపుకుంటున్న దివ్య అనే మహిళతో కానిస్టేబుల్ సాయికుమార్ కు పరిచయం ఏర్పడింది. సాయికుమార్ పలుమార్లు ఆమెతో ఫోన్‌లో సంభాషించడానికి గమనించిన సదరు మహిళ భర్త శివకుమార్, అల్లుడు కిరణ్ తో కలిసి కానిస్టేబుల్ సాయికుమార్ ను భారీ మొత్తంలో డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించి, ఇవ్వకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో విషయం బయటకు తెలిస్తే ఎక్కడ పరువు పోతుందోనని మనస్థాపానికి గురై సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సాయికుమార్ భార్య కాటూరి శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అల్లు అర్జున్‌కు ఓయూ జేఏసీ హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబర్ 29:** పుష్ప 2 చిత్రం ప్రీమియర్ షో సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆ చిత్ర హీరో అల్లు అర్జున్ నివాసంపై దాడి చేసిన ఓయూ జేఏసీకి ఆదివారం బెదిరింపులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పోలీసులకు ఓయూ విద్యార్థి జేఏసీ ఫిర్యాదు చేసింది. హీరో నివాసంపై దాడి చేసినందుకు అల్లు అర్జున్‌కు వెంటనే క్షమాపణలు చెప్పాలని తమకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఓయూ విద్యార్థి జేఏసీ వెల్లడించింది. అలా చేయకుంటే.. చంపేస్తామని అల్లు అర్జున్ మనుషులు తమను బెదిరిస్తున్నారని ఓయూ విద్యార్థి జేఏసీ... తమ ఫిర్యాదులో స్పష్టం చేసింది. అల్లు ఆర్మీ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ పేరుతో తమకు వందల ఫోన్ కాల్స్ వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తన అనుచరుల నుంచి తమకు ఫోన్ కాల్స్ రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత హీరో అల్లు అర్జున్‌దేనని ఓయూ జేఏసీ స్పష్టం చేసింది. అలాగే తమ సెల్ నెంబర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసి.. వైరల్ చేస్తున్నారని జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. తమకు ఫోన్ కాల్స్ ఆగకుంటే.. వేలాది మంది విద్యార్థులతో అల్లు అర్జున్ ఇంటిని ముట్టడిస్తామని ఓయూ విద్యార్థి జేఏసీ హెచ్చరించింది. తమకు బెదిరిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పోలీసులకు చేసిన ఫిర్యాదులో జేఏసీ పేర్కొంది.

# సాఫ్ట్ స్కిల్స్ నేర్పించే దిశగా చర్యలు తీసుకోండి



మొదటి పేజీ తరువాయి

కండ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తించడం, పదాలను చదవడం వంటి స్కిల్స్ ను ప్రదర్శించిన అక్కడి విద్యార్థులను ముఖ్యమంత్రి అభినందించారు. కన్హా శాంతి వనం నిర్వాహకులు, శ్రీ రామ్ చంద్ర మిషన్ అధ్యక్షుడు, హర్ట్ ఫుల్ నెస్ గ్లోబల్ గైడ్, ఆధ్యాత్మికవేత్త గౌరవ కమలేష్ పటేల్ (దాజీ) స్వయంగా ముఖ్యమంత్రికి స్వాగతం పలికి, వనమంతా తిప్పి చూపించారు. కన్హా శాంతివనం ఆవరణలోని ట్రీ కన్జర్వేషన్ సెంటర్ లో వివిధ రకాల వంగడాల అభివృద్ధి, మొక్కల పెంపకానికి సంబంధించిన విధానాలను శాంతి వనం నిర్వాహకులు సీఎంకు వివరించారు. శాంతి వనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెయిన్ ఫారెస్ట్ ను, మెడిటేషన్ సెంటర్ హాలును సందర్శించిన సీఎం అక్కడ ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కాలే యాదయ్య, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి అభినందనలు**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సీఎం ఫోన్ చేసి, అభినందించారు. "మీ కృషి, మీ సహకారం, మీ సలహాతోనే ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు పట్టాలెక్కింది" అని ముఖ్యమంత్రికి మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. 2017లో ఆగిపోయిన ప్రాజెక్టు మీ అనితరసాధ్యమైన సహకారంతోనే ఈ సంవత్సరంలో సాధ్యమైందని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు మంజూరు చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### రైజింగ్‌తెలంగాణ సాకారమవుతున్నది

ప్రజా ప్రభుత్వ సంకల్పం 'రైజింగ్‌తెలంగాణ' కల సాకారమవుతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎక్స్‌వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) సాధనలో రాష్ట్రం గర్వించదగ్గ వృద్ధిని సాధించిందన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన మొదటి నెల నుంచే దావోస్, అమెరికా, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో పర్యటించి, పెట్టుబడుల సాధన కోసం చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. 2023 ఏప్రిల్ - సెప్టెంబర్ తో పోల్చితే 2024 ఏప్రిల్ - సెప్టెంబర్ అర్ధ సంవత్సరంలో అద్భుత లక్ష్యాలను సాధించామన్నారు. రూ.12,864 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సాధనతో 33 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో యువత ఉపాధి - ఉద్యోగ కల్పనకు ప్రజా ప్రభుత్వం బలమైన సంకల్పంతో పని చేస్తుందనడానికి ఇది నిదర్శనమని చెప్పారు. ఈ పురోగతి సాధనలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని ట్వీట్ చేశారు.

# రైతు భరోసాకు కట్టుబడి ఉన్నాం



మొదటి పేజీ తరువాయి

రైతు భరోసా అందజేసేందుకు ఖరారు చేయాల్సిన విధానాలపై వారు చర్చలు జరిపారు. క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతుల అభిప్రాయాలు, అధికారులు సేకరించిన సమాచారంపై కసరత్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట మేరకు రైతులకు రైతు భరోసా ఇచ్చి తీరుతామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రెండు నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్లతో రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అంతేకాదు రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్‌ను ద్వారా రైతు సమస్యలను పరిష్కరించేందుకు రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 110 రైతు వేదికల్లో రూ.4 కోట్లకు పైగా నిధులు వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. 1,57,51000 ఎకరాలకు 7,625 కోట్ల నిధులు రైతుల ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. పంటల బీమా పథకం కింద ప్రీమియం మొత్తాన్ని రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. 2024-25లో రాష్ట్రంలో లక్ష ఎకరాల ఆయిల్ ఫామ్ సాగును చేపట్టాలని రాష్ట్ర సర్కార్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2023-24 ఏడాదికి ఆయిల్ సాగు పథకం కింద కేంద్రం.. 80.10 కోట్లు విడుదల చేయగా రాష్ట్ర వాటా కలుపుకొని మొత్తం 133.5 కోట్లు విడుదలేనట్లు చెప్పారు. అలాగే సన్నవడ్లకు ప్రతి క్వింటాకు 500 రూపాయలు బోనస్‌గా చెల్లిస్తున్నామనే విషయాన్ని గుర్తుచేశారు.

### పోలీసుల నోటీసులకు
# సంధ్య థియేటర్ రిప్లై..

మొదటి పేజీ తరువాయి

రిప్లై ఇచ్చింది. 6 పేజీల లేఖను న్యాయవాదుల ద్వారా పంపించింది. సంధ్య థియేటర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని స్పష్టం చేసింది. 45 ఏళ్లుగా థియేటర్ రన్ చేస్తున్నామని, గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటన చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్‌లో 80 మంది స్టాఫ్ విధుల్లో ఉన్నట్లు రిప్లైలో పేర్కొంది. 4, 5 తేదీల్లో థియేటర్‌ను మైత్రి మూవీస్ ఎంగేజ్ చేసుకుందన్నారు. గతంలో అనేక సినిమాల రిలీజ్ సందర్భంగా హీరోలు థియేటర్‌లో సినిమాలకు వచ్చారన్నారు. ఇకపోతే సంధ్య థియేటర్‌లో ఫోర్ వీలర్స్, టూ వీలర్స్‌కి ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కూడా ఉందని పేర్కొన్నది.

# నేడు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

### మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలపనున్న సభ
### తెలంగాణ ఏర్పాటులో ఆయన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ నివాళి



**హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. దేశాన్ని ఆర్థిక చిక్కుల నుంచి బయటపడేసి, అభివృద్ధి పథంలో పయనించేలా మార్గనిర్దేశం చేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించనుంది. ఇటీవల జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాల అనంతరం ఈ నెల 21న సభ నిరవధికంగా వాయిదాపడిన సంగతి తెలిసిందే. అయితే సభను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇంకా ప్రోరోగ్ చేయకపోవడంతో ఈ నెల 30న సోమవారం ప్రత్యేక భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభించనున్నట్టు శాసనసభ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు శనివారం లేఖ విడుదల చేశారు. ఈ ప్రత్యేక సమావేశం ఒక్కరోజుకే పరిమితం చేయనున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 3వ తేదీ వరకు ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా పాటిస్తున్నాయి. ఈ క్రమంలో మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆయన కృషిని కొనియాడుతూ తీర్మానం చేయడం ద్వారా నివాళి అర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదిలాఉంటే సోమవారం నిర్వహిస్తున్న అసెంబ్లీ ప్రత్యేక భేటీకి బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కే.చంద్రశేఖర్రావు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మన్మోహన్ నేతృత్వంలోని కేబినెట్‌లో కొంతకాలం కేంద్ర మంత్రిగా పనిచేసిన కేసీఆర్.. పలు సందర్భాల్లో ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ సహకారాన్ని రికార్డుల్లో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో కేసీఆర్ ప్రసంగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మన్మోహన్ కృషిని కొనియాడుతూ, నివాళి అర్పించే అసెంబ్లీ ప్రత్యేక భేటీకి ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరవుతారని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

### పురుగుల మందు తాగి
# ఆపై ఉరి చేసుకొని..

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్29 :** అప్పుల బాధతో కానిస్టేబుల్ కుటుంబంతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం.. సిరిసిల్ల 17వ బెటాలియన్ కానిస్టేబుల్ బండారి బాలకృష్ణ (36) సిద్దిపేట పట్టణంలో ని కాళ్లకుంట్ల కాలనీలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన బాలకృష్ణ రాత్రి 11 గంటల సమయంలో భార్య మానసతో ప్రైవేటు కంపెనీలో పెట్టుబడి పెట్టడం కోసం 25 లక్షల అప్పు అయిందని తెలిపాడు. అప్పుల వారు ఇంటి మీదికి వచ్చి గొడవ చేయక ముందే ఆత్మహత్య చేసుకొని చనిపోవడం మంచిదని భార్యకు చెప్పాడు. అనంతరం తన భార్యకు టీ పెట్టమని చెప్పి టీ తెచ్చాక, ఎలుకల మందు పౌడర్‌ను టీలో కలిసి భార్యతో పాటు కుమారులు యశ్వంత్, అశ్విత్‌కు ఇచ్చాడు. అది తాగి అందరూ పడుకోగా తెల్లవారు జామున 4 గంటల సమయంలో బాలకృష్ణ, మానసకు మెలకువ వచ్చింది. పిల్లలతో సహ ఎవరికీ ఏమీ కాకపోవడంతో బాలకృష్ణ తన భార్య చీరను తీసుకొని పక్క గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన అతని భార్య బాలకృష్ణ తమ్ముడు సాయి తో పాటు తన తమ్ముడు శ్రీ శైలంకు ఉరి వేసుకున్న విషయం ఫోన్ ద్వారా తెలుపడంతో హుటాహుటిన అక్కడికి చేరుకొని డోర్ పగలగొట్టి బాడీని కిందకు దించడం తో పాటుగా పోలీసులకు సమాచారం అందించి 108 లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలకృష్ణ అప్పటికే మరణించినట్లు తెలిపారు. బాలకృష్ణ భార్య పిల్లలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారి పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

# అదుపులోనే శాంతిభద్రతలు

**హైదరాబాద్, డిసెంబర్29:** రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ జితేందర్‌తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లో 2024 వార్షిక క్రైం రిపోర్టు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్‌రహిత తెలంగాణే లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గతేడాదితో పోలిస్తే 9.87 శాతం కేసులు పెరిగాయని డీజీపీ జితేందర్ తెలిపారు. గతేడాది 1,38,312 కేసులు నమోదవ్వగా.. ఈ ఏడాది 2,34,158 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. సైబర్ నేరాలు 43.44 శాతం పెరిగాయని చెప్పారు. ఈ ఏడాది 33,168 సైబర్ క్రైమ్ కేసులను నమోదు చేశామని తెలిపారు. 1525 కిడ్నాప్, 703 దొంగతనాలు, 58 దోపిడీలు, 856 హత్య, 2945 అత్యాచార కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. డయల్ 100కు 16,92,173 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. కొత్త చట్టం వచ్చిన తర్వాత 85,190 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

### డ్రగ్స్‌పై ఉక్కుపాదం

రాష్ట్రంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1942 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. 142.95 కోట్ల విలువ చేసే 20 టన్నుల డ్రగ్స్‌ను సీజ్ చేశామని చెప్పారు. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. 48 డ్రగ్స్ కేసుల్లో నిందితులకు శిక్ష పడిందని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా సైబర్ నేరగాళ్ల నుంచి రూ.2.42 కోట్ల నగదును రికవరీ చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది 85 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని పేర్కొన్నారు. ఒకటి రెండు ఘటనలు మినహా రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణం ఉందని అన్నారు. మేజర్ ఇన్సిడెంట్‌లు ఏమీ జరగలేదని తెలిపారు.

### వ్యక్తిగత కారణాలతోనే..

రాష్ట్రంలో పోలీసుల వరుస ఆత్మహత్యలపై స్పందించారు. ఈ ఏడాదే కాదు.. ప్రతి సంవత్సరం కూడా ఏదో ఒక కారణంతో పోలీసులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. వీటికి పోలీసు శాఖ పరంగా ఎలాంటి సమస్యలు లేవని పేర్కొన్నారు. చాలాచోట్ల ఆర్థిక, వ్యక్తిగత ఇబ్బందుల కారణంగా పోలీసులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. కొన్ని కేసుల్లో మాత్రమే పని ఒత్తిడి కారణంగా సూసైడ్‌లు చేసుకుంటున్నారని వివరించారు. 2024 క్రైమ్ వార్షిక నివేదికను హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీజీపీ జితేందర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఆత్మహత్య ఆలోచనలు రాకుండా పోలీసులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన కేసులో దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
30 డిసెంబర్
2024





# ఫుల్ రష్‌తో గుట్ట కిటకిట...!!

**యాదగిరిగుట్టలో నిత్య పూజల సందడి**

**ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం**

**ఆదివారం ఆలయానికి రూ.56.23 లక్షల ఆదాయం**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సండే హాలిడే కావడంతో.. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు ఎక్కడ చూసినా భక్తులతో సందడిగా కనిపించాయి. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వెయిట్ చేయాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో.. నారసింహుడి ధర్మదర్శనానికి మూడు గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో.. కొండపైన, కిందా ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. కొండ కింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, కల్యాణకట్ట, అన్నదాన సత్రం, పార్కింగ్ ప్రదేశం.. కొండపైన బస్ బే ఏరియా, దర్శన, ప్రసాద క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో జనసంద్రమయ్యాయి. ఆలయంలో నిర్వహించిన నారసింహుడి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.56,23,335 ఆదాయం సమకూరింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.21,62,850, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.8 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.12.60 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.4,78,800 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు.









ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
30 డిసెంబర్
2024




# మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన



శ్రీశైలం, డిసెంబర్ 29 ( రోమింగ్ న్యూస్ ) ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహింపబడనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు వేలాది మంది పాదయాత్రతో కూడా శ్రీశైలాన్ని చేరుకుంటారు. శివదీక్షా భక్తులతో పాటు సాధారణ భక్తులు కూడా ఈ కాలిబాటమార్గంలో క్షేత్రానికి చేరుకోవడం జరుగుతుంది.

కాలిబాటమార్గంలోని దామెర్లకుంట పెద్దచెరువు ప్రాంతాలలో చేయాల్సిన ఆయా ఏర్పాట్లకు సంబంధించి ఈ రోజు (29.12.2024) దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఆత్మకూరు రేంజ్ అటవీశాఖ అధికారులు మరియు సిబ్బంది కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు.కాగా ప్రధాన రహదారిలోని ఆత్మకూరు వెంకటాపురం నుంచి భక్తులు అటవీమార్గంలో గోసాయికట్ట వీరాంజనేయస్వామి, నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీమునికొలను, కైలాసద్వారం మీదుగా శ్రీశైలక్షేత్రాన్ని చేరుకోవడం జరుగుతుంది. ఈ కాలిబాట మార్గం సుమారు 40 కి.మీ ఉంటుంది.ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు కాలిబాటమార్గములో మంచినీటిసదుపాయం, భక్తులు సేదతీరేందుకు చలువపందిర్లు ఏర్పాటు, తాత్కాలిక విద్యుద్దీకరణ, అన్నదానం చేసే భక్తబృందాలకు దేవస్థానం అందించాల్సిన సహాయసహకారాలు, కాలిబాటమార్గములోని ఆయా ప్రదేశాలలో మార్గసూచికల ఏర్పాటు, వైద్యశిబిరాల ఏర్పాటు మొదలైన వాటికి సంబంధించిన అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ అటవీశాఖ వారి సహకారంతో దామెర్లకుంట - పెద్దచెరువు ప్రాంతాలలో జంగిల్ క్లియరెన్స్ పనులను (పిచ్చిమొక్కలను తొలగించే పనులను) వెంటనే చేపట్టాలన్నారు.

దామెర్లకుంట - పెద్దచెరువు వద్ద గత సంవత్సరము కంటే కూడా అదనంగా చలువపందిళ్ళు వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ ప్రాంతాలలో ఒక్కొక్క చోట కనీసం 5 ప్రదేశాలలో ఈ చలువపందిర్లు ఉండాలన్నారు.

ఒక్కొక్క పందిరిలో కనీసం వెయ్యి మందికిపైగా భక్తులు సేద తీరేవిధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. చలువపందిర్లలో ఫ్లోర్మ్యాట్, సైడ్వాల్స్ ఏర్పాటు ఉండాలన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా పైప్ పెండాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గతములో వలేనే జనరేటర్లను ఏర్పాటు చేసి తాత్కాలిక విద్యుద్దీకరణ ఏర్పాట్లు కూడా చేపట్టాలన్నారు.

అదేవిధంగా పెద్దచెరువు, దామర్లగుంటలలో గతంలో కంటే కూడా అధిక సంఖ్యలో తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. గత సంవత్సరం కంటే కూడా కనీసం 20 శాతం మేరకు అధిక ఏర్పాట్లు ఉండాలన్నారు.

గత సంవత్సరం కంటే కూడా అధికసంఖ్యలో వాటర్ ట్యాంకర్లను పంపాలని నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు.

కాగా కాలిబాటతో వచ్చే భక్తులు ప్రధానంగా కాలిబొబ్బలు, ఒళ్లునొప్పులు మొదలైన ఇబ్బందులతో బాధపడుతుంటారని, జిల్లా వైద్యశాఖ సమన్వయముతో అటవీమార్గంలో ఏర్పాటు చేయనున్న వైద్యశిబిరాలలో ఈ సమస్యలకు సంబంధించిన పూతమందులు (ఆయింట్మెంట్) మాత్రలు మొదలైనవి అందుబాటులో వుంచేందుకు చర్యలు చేపట్టాలని దేవస్థాన వైద్య విభాగాన్ని ఆదేశించారు.నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు ప్రాంతాలలో అన్నదానం చేస్తున్న భక్తబృందాలకు దేవస్థానం పక్షాన పూర్తి సహాయసహకారాలను అందించాలన్నారు.

అదేవిధంగా నాగలూటిలో కూడా జంగిల్ క్లియరెన్స్, పైప్ పెండాల్స్, తాత్కాలిక విద్యుద్దీకరణ మొదలైన వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. మురళీబాలకృష్ణ, ఎం.నరసింహారెడ్డి, సివిల్ మరియు ఎలక్ట్రికల్ విభాగపు ఇంచార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, పి.చంద్రశేఖరశాస్త్రి, పి.వి.సుబ్బారెడ్డి, సంబంధిత సహాయ ఇంజనీర్లు, రాజేశ్వరరావు, రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా క్యాడర్ పని చేయాలి

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్ : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని క్యాడర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన 50 మంది బీఆర్ఎస్ నాయకులు.. ఆదివారం యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యం కాని విధంగా.. రాష్ట్రంలో రూ.2 లక్షల లోపు ఉన్న రైతు రుణాలను ఏకకాలంలో మాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి మాత్రమే దక్కిందన్నారు. రైతు పండించిన పంటకు మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి రైతులకు ఎక్కువ లాభాలు వచ్చేలా చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గ్రౌండ్ లెవల్ లో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో కర్రె కరుణాకర్, ఉపేందర్, శేఖర్, మహేష్, సాయిరాం, శివ, గణేష్, భాను తదితరులు ఉన్నారు.

# నిత్య అన్నదాన పథకానికి విరాళం



శ్రీశైలం, డిసెంబర్ 29 ( రోమింగ్ న్యూస్ ) శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం రూ. 5,00,004 /-లను ( అయిదు లక్షల నాలుగు రూపాయలు) శ్రీ వి. భాస్కరరావు తూర్పుగోదావరి జిల్లా వారు అందజేశారు. ఈ మొత్తాన్ని డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్. రమణమ్మ గారికి అందజేయడం జరిగింది. కార్యక్రమములో అన్నప్రసాద వితరణ పర్యవేక్షకులు గంజి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం, శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటం అందజేయబడ్డాయి.

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

## నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం




నకిరేకల్ : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం నకిరేకల్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు బాణాల రాంరెడ్డి పదవి విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య బోధన చేస్తు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. పాఠశాల అభివృదికి, విద్యార్థుల అభివృద్ధికి వారు చేసిన సేవలు అభినందనియమని తెలిపారు. అనంతరం రాంరెడ్డి దంపతులను సన్మానించారు.



హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 37 వ పుస్తకాల పండుగ కు విపంచి ఫౌండేషన్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బుక్ ఫేర్ అధ్యక్షులు కవి యాకూబ్ గారికి పుస్తకాల వితరణ కోసం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అదే విధంగా వివిధ స్టాల్ సందర్శించి గ్రామీణ గ్రంధాలయాల కోసం కోసం పుస్తకాలు సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, కాలోజి గ్రంధాలయ నిర్వాహకులు ఆందోజు నాగ భూషణం, జ్యోతిష నిపుణులు కూరెళ్ల నర్సింహా చారి, చిన్నారులు అక్షిత, సాయి చంద్ పాల్గొన్నారు

# యాదగిరిగుట్టపై క్యూలైన్ గ్రిల్ లో ఇరుక్కున్న బాలుడి తల

## చాకచక్యంగా బయటకు తీసిన అయ్యప్ప మాలధారులు





**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం ఆలయానికి వచ్చిన ఫ్యామిలీకి కాసేపు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం స్వామివారి దర్శనం కోసం క్యూలైన్ లో నిరీక్షిస్తుండగా.. బాలుడి తల క్యూలైన్ ఐరన్ గ్రిల్ లో ఇరుక్కుపోయింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ బోడుప్పల్ కు చెందిన కిష్టయ్య.. తన ఫ్యామిలీతో కలిసి స్వామివారి దర్శనం కోసం శనివారం రాత్రి యాదగిరిగుట్టకు వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నారసింహుడి దర్శనం కోసం వీఐపీ క్యూలైన్ లో వెయిట్ చేస్తున్నారు. బ్రేక్ సమయం కావడంతో.. కాసేపు దర్శన క్యూలైన్లను నిలిపివేశారు. దీంతో ఫ్యామిలీతో కలిసి క్యూలైన్లలో వెయిట్ చేస్తున్న సమయంలో.. తన ఏడేళ్ల కుమారుడైన దయాకర్ తల ప్రమాదవశాత్తు దర్శన క్యూలైన్ గ్రిల్ లో ఇరుక్కుంది. దాదాపుగా పది నిమిషాల పాటు సదరు బాలుడు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. క్యూలైన్ లోనే ఉన్న తోటి భక్తులు, అక్కడే ఉన్న అయ్యప్ప మాలధారులు చాకచక్యంగా వ్యవహరించి గ్రిల్ ను కొంచెం వెడల్పు చేసి గ్రిల్ లో తల ఇరికిన బాలుడిని జాగ్రత్తగా బయటకు తీశారు. దీంతో తీవ్ర ప్రమాదం తప్పినట్లయింది. కాసేపయ్యాక షాక్ నుండి తేరుకున్న బాలుడి యధాస్థితికి వచ్చాడు. అనంతరం ఫ్యామిలీతో కలిసి స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నాడు.

# బుద్ధ నగర్ లో పేదలకు బ్లాంకెట్స్ పంపిణీ

మేడిపల్లి, రోమింగ్ న్యూస్: మేడిపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేముల నాదం గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ బుద్ధ నగర్ లో పేద లకు బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జనరల్ సెక్రెటరీ పల్లె బాలరాజు గౌడ్, లయన్ బింగి బిక్షపతి, మనిచేర్ల లావణ్య, హరినాథ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రవీందర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.






# యాదగిరిగుట్ట ఘాట్ రోడ్డుపై యాక్సిడెంట్





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఘాట్ రోడ్డుపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్వామివారి దర్శనం కోసం హైదరాబాద్ కు చెందిన భక్తులు కారులో కొండపైకి వెళ్తుండగా.. అదే సమయంలో భక్తులను కొండపైన దించి కిందికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డుపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం డ్యామేజ్ అయింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు, కారు డ్రైవర్లు అప్రమత్తమై వాహనాలను స్పాట్ లోనే కంట్రోల్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా ఎగ్జిట్ ఘాట్ రోడ్డు నుండే కొండపైకి, కిందికి వాహనాల రాకపోకలు నడుస్తుండడంతో ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. మరో ఘాట్ రోడ్డు అందుబాటులో ఉన్నా ఎగ్జిట్ ఘాట్ రోడ్డు నుండే రాకపోకలు జరుగుతుండడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండపైకి ఎంట్రీ, ఎగ్జిట్ కోసం వేర్వేరు ఘాట్ రోడ్లను ఉపయోగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
30 డిసెంబర్
2024




# సంక్రాంతిలోపు చెల్లించాల్సిందే!

- తక్షణమే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి
- లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో మహోద్యమం చేస్తాం..
- కేంద్ర మంత్రి బండి



**కరీంనగర్, డిసెంబర్29:** వచ్చే సంక్రాంతి లోపు 'ఫీజు రీయంబర్స్ మెంట్" మొత్తాన్ని చెల్లించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి తర్వాత మహోద్యమాలు చేసి, రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచి తీరుతామని అల్టిమేటం జారీ చేశారు. అట్లాగే ఇచ్చిన మాట మేరకు కట్టుబడి వెంటనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ 'దీన్ దయాళ్ కోచింగ్ సెంటర్' పేరిట తాను నిర్వహించిన కోచింగ్ సెంటర్ లో చదువుకుని ఉద్యోగాలు పొందిన పలువురు అభ్యర్థులను సన్మానించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకునే స్థోమత లేని నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంవల్లే ఈరోజు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, బిశ్వాల్ కమిటీ 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రకటించి 4 ఏళ్లయినా... వాటిని భర్తీ చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. 25 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి... 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గప్పాలు కొడుతోందని విమర్శించారు. ఫీజు రీయంబర్స్ మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు అల్లాడుతున్నారని, కాలేజీల యాజమాన్యాలు నష్టపోయి కాలేజీలు మూసుకునే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతిలోపు బకాయిపడ్డ ఫీజు రీయంబర్స్ మెంట్ సొమ్మును చెల్లించకపోతే, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్లను ఆహ్వానించిన నరేంద్రమోదీ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### కాంగ్రెస్ రాజకీయ సిగ్గు చేటు

మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై కాంగ్రెస్ రాజకీయం చేయడం సిగ్గు చేటని బండి సంజయ్ అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న పదేళ్లు సూపర్ ప్రధానిగా సోనియాగాంధీ కొనసాగుతూ రబ్బర్ స్టాంప్ గా మార్చారని, అట్లాగే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రజాప్రతినిధ్యం చట్టంలోని నిబంధనలను సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తే.. ఆ ఆర్డినెన్స్ కాపీలను రాహుల్ గాంధీ చింపివేసి మన్మోహన్ ను దారుణంగా అవమానించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ, మన్మోహన్ సింగ్ సేవలను గుర్తించి అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించి ఆయనకు ఢిల్లీలోనే స్మారక స్థల్ నిర్మించేందుకు సిద్దమైందని, కానీ మాజీ ప్రధానిగా పనిచేసిన పీవీ నర్సింహారావు అంత్యక్రియలు ఢిల్లీలో నిర్వహించకుండా అవమానించిన పార్టీ కాంగ్రెస్. వారికి మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత లేనేలేదని పేర్కొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్‌ను ఇరికించింది హరీశ్ రావే

- ఓఆర్ఆర్‌లీజు అంశంపై విచారణ సాగుతున్నది
- ఓఆర్ఆర్ ఎపిసోడ్‌లో కూడా జైలుకి వెళ్తారు
- కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ఓఆర్ఆర్‌మంజూరుపై ప్రధాని,గడ్కరీకి ధన్యవాదాలు

**హైదరాబాద్, డిసెంబర్29:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లీజు అంశంపై విచారణ జరుగుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి హరీశ్ రావు తన మామ కేసీఆర్, బామ్మర్ది కేటీఆర్‌ను ఇరికించేందుకే ఓఆర్ఆర్ టోల్ లీజ్‌పై సిట్ వేయాలని అడిగారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హరీశ్ రావు అసెంబ్లీలో కోరడంతోనే సీఎం రేవంత్ రెడ్డి సిట్ ఏర్పాటు చేశారన్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో దొంగలు దొరికారని మంత్రి చెప్పారు. ఓఆర్ఆర్ టోల్ లీజ్‌లో అవకతవకలు కూడా బయటపడతాయన్నారు. ఇప్పటికే ఈ ఫార్ములా రేసు కేసులో ఒకరో ఇద్దరో జైలుకి పోతారని, ఓఆర్ఆర్ ఎపిసోడ్‌లో కూడా జైలుకి వెళతారన్నారు. ఆర్ఆర్ఆర్‌కి ఆరేళ్ల ఆలస్యమైందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఇప్పుడు టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందన్నారు. మార్చిలో ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఆర్ఆర్ఆర్ కోసం ఢిల్లీలో ఉండి ఎంతో కృషి చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. 2017లో ఆగిపోయిన ప్రాజెక్టుకు తమ కృషి వల్ల ముందడుగు పడిందన్నారు. ఆర్ఆర్ఆర్ మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోడీ, దీనికి సహకరించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆర్ఆర్ఆర్ పనులకు కీలక ముందడుగు పడినట్లయిందన్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు కృషి చేసిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని సీఎం రేవంత్ అభినందించారు. ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. అందుకు కోమటిరెడ్డి బదులిస్తూ.. మీ చొరవ, కృషి, సహకారం, సలహాలతోనే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పట్టాలెక్కిందని రేవంత్ రెడ్డిని ప్రశంసించారు.

# హాస్టల్ భోజనం బాగాలేదని..

- 300 మందిని ఇళ్లకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- నిర్మల్‌జిల్లా దిలావర్‌పూర్ కేజీబీవీలో ఘటన
- అన్నంలో పురుగులు వస్తున్నాయని ఆవేదన
- ఆ కేజీబీవీలో ఏం జరుగుతోంది



**నిర్మల్, డిసెంబర్29:** తెలంగాణలో గత కొన్ని నెలలుగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల హాస్టళ్లలో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఆందోళన కొనసాగుతోంది. కస్తూర్బా విద్యాలయాల బోధన, బోధనేతర సిబ్బంది సమ్మె చేయడంతో అక్కడ పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. ఓవైపు క్లాసులు జరగక, సరైన భోజనం అందక సారంగాపూర్ మండలం జామ్ కేజీబీవీ నుంచి సుమారు 90 మంది విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లి పోయారు. ఈ విషయం బయటకు తెలియడంతో శనివారం చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లడానికి తరలివచ్చారు. సిబ్బందితో గొడవ పడీ మరి ఇంటికి తీసుకెళ్తున్నారు.

### ఎంఈఓ దృష్టికి తీసుకొచ్చిన తల్లిదండ్రులు

కస్తూర్బా స్కూల్ ఇంఛార్జ్‌గా ఉన్న ఎంఈఓ మధుసూదన్ తో విద్యార్థుల తల్లిదండ్రుల్ను మాట్లాడారు. శనివారం సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. తరగతులు జరగడం లేదని, సరైన భోజనం అందించడం లేదని విద్యార్థినులు అక్కడే ఉన్న తమ తల్లిదండ్రులకు తెలిపారు. ఈ క్రమంలో వారు ఆందోళనకు దిగారు. ఉడికీ ఉడకని ఆహారాన్ని, నాణ్యత లేని అందిస్తూ తమ పిల్లల ఆరోగ్యాన్ని చెడగొడుతారా.. వారి ప్రాణాల మీదకు తెస్తారా అని ప్రశ్నించారు.

### కేజిబివి పాఠశాలల్లో ఆందోళన

నిర్వాహణ సరిగ్గా లేని చోట తమ పిల్లలు మాత్రం ఎందుకంటూ విద్యార్థులను తల్లిదండ్రులు తమతో తీసుకెళ్తామన్నారు. ఈ క్రమంలో అక్కడ కాసేపు వాగ్వాదం జరిగింది. చివరకు వారి కోరిక మేరకు సుమారు 215 మంది విద్యార్థినులను తల్లిదండ్రుల వెంట పంపినట్లు ఎంఈవో తెలిపారు. శుక్రవారం, శనివారాల్లో మొత్తం 305 మంది విద్యార్థినులు తమ తల్లిదండ్రులతో ఇంటికి వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 50 మంది వరకు ఉన్నారు. సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ ఎప్పటికప్పుడు కస్తూర్బా స్కూల్, హాస్టల్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.. సిబ్బందిని ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు.

### రాత్రిపూట వెళ్లి సిబ్బందిని ప్రశ్నించిన డీఈఓ

పెద్ద సంఖ్యలో విద్యార్థినులు తల్లిదండ్రులతో ఇంటికి వెళ్లారని తెలుసుకున్న డీఈఓ రామారావు శనివారం రాత్రి 9 గంటలకు సారంగాపూర్ మండలం జామ్ కేజీబీవీని సందర్శించారు. అక్కడి సమస్యలపై సిబ్బందిని ఆరా తీశారు. ఇంత మంది విద్యార్థినులను ఎందుకు ఇళ్లకు పంపాల్సి వచ్చిందని ఎంఈవోను ప్రశ్నించారు. బోధనేతర సిబ్బందితో డీఈవో సమావేశమై విధుల్లో చేరాలని సూచించడంతో వారు తిరిగి విధుల్లో చేరారు. ఆయన వెంట డిసీడీవో సలోమి కరుణ, పర్యవేక్షకుడు వెంకటరమణ ఉన్నారు. కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది సమ్మెతో విద్యార్థులకు ఓవైపు క్లాసులు జరగడం లేదని, మరోవైపు నాణ్యమైన భోజనం అందించడం లేదని, పిల్లలను ఇంటికి పంపించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని కస్తూర్బా విద్యాలయంలో టిఫిన్‌లో బొద్దింక వచ్చిందని విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. వారు ఎంఈఓ శంకర్‌ను ప్రశ్నించారు. బొద్దింక రావడం అవాస్తవమని, నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు.

### బొద్దింక, కాదు అంటున్న సిబ్బంది..

ఆరో తరగతి విద్యార్థిని పళ్లెంలో బొద్దింక వచ్చిందని, ఎంఈవో దృష్టికి తీసుకెళ్లడంతో వండిన అల్పహారాన్ని పారవేయించారని తెలిపారు. తల్లిదండ్రుల ఆందోళన చేస్తున్నట్లు తెలుసుకున్న తహసీల్దార్ స్వాతి, ఎంపీవో గోవర్ధన్, ఈవో చంద్రశేఖర్ కిచెన్‌ను పరిశీలించారు. విద్యార్థులను ఇంటికి పంపించాలని తల్లిదండ్రులు పట్టుబట్టారు. మొత్తం 380 మందికి ఇప్పటికే వివిధ కారణాలతో 120 మంది ఇళ్లకు వెళ్లారు. శనివారం 280 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యంగా ఉన్న 50 మందిని ఇళ్లకు పంపించారు. దీంతో జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో విద్యా బోధన, హాస్టల్లో వసతిపై గందరగోళం నెలకొంది.

# ఇకనైనా ఇంటికి రమ్మని పిలవండి!

- మావోయిస్టు అగ్రనేత 'దేవ్ జీ' ఇంటికి మెట్‌పల్లి డీఎస్పీ రాములు
- తిప్పిరి తిరుపతి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్



**జగిత్యాల:** మావోయిస్టు అగ్రనేత కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ 'దేవ్ జీ' ఇంటికి మెట్‌పల్లి డీఎస్పీ రాములు ఆదివారం వెళ్లారు. ఇది స్థానికంగా చర్చనీయాంశమైంది. తిప్పిరి తిరుపతిని అజ్ఞాతంలో ఉంటూ జనాలకు చేసిన సేవలు చాలించి ఇకనైనా జనజీవన స్రవంతిలో కలవాలని.. అతన్ని మీరే ఆహ్వానించాలని వారి కుటుంబ సభ్యులకు డీఎస్పీ రాములు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు కోరుట్ల సీఐ సురేష్ తో కలిసి తిప్పిరి తిరుపతి కుటుంబ సభ్యులను కలుసుకుని వారితో కొద్దిసేపు గడిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రోజులు బాగా లేవని, ఇంకెన్నాళ్లు బంధువులను.. కుటుంబ సభ్యులను.. రక్త సంబంధీకులను.. పాత స్నేహితులను వదిలి ఆ అజ్ఞాతంలో ఉండి సాధించేదేంటని డీఎస్పీ రాములు కౌన్సెలింగ్ నిర్వహించారు.

### గణపతితో కలిసి కేంద్ర కమిటీలో..

కాగా.. 'దేవ్ జీ' మావోయిస్టు అగ్రనేత గణపతితో పాటు కేంద్ర కమిటీ సభ్యులలో ఒకడిగా కీలక నేతగా పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కీలక బాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారికి నిత్యావసర సరుకులను అందజేశారు. 'తిప్పిరి తిరుపతి' గత కొద్ది సంవత్సరాల నుండి దళంలో పనిచేస్తుండడంతో కుటుంబ సభ్యులను అతని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతన్ని మీరు యధావిధిగా జనాల్లోకి వచ్చేలా ఇంటి నుంచి పిలుపునివ్వాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరి వెంట కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు. డీఎస్పీ రాములు మావోయిస్టు ఇంటికి వెళ్లి మాట్లాడరటన్న వార్త గురించి స్థానికంగా చర్చనీయాంశమైంది.

# పోలీసుల మరణ మృదంగం..

ప్రభుత్వానికి పట్టింపు లేదా? ● మాజీ మంత్రి హరీశ్ రావు



పట్టింపు లేదా? అంటూ ఆదివారం ట్వీట్ చేశారు. 'ములుగు జిల్లాలో ఎస్సై, సిద్దిపేటలో కానిస్టేబుల్ కుటుంబం, కామారెడ్డిలో ఎస్సై , కానిస్టేబుల్, ఈ రోజు సిరిసిల్లలో కానిస్టేబుల్ కుటుంబం, మెదక్ కుల్చారంలో హెడ్ కానిస్టేబుల్.. వీరంతా స్వల్ప కాలంలో ఆత్మహత్యలకు పాల్పడ్డ పోలీసులు. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన పోలీసులే వరుసగా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. శాంతి భద్రతలు పరిరక్షించవలసిన రక్షకుల జీవితాలకే రక్షణ కరువైంది. పని ఒత్తిళ్లు, పెండింగ్ హామీలను తీర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పోలీసులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. ఈ ఆత్మహత్యలపై నిజానిజాలు వెలుగులోకి రావడానికి శాఖాపరమైన దర్యాప్తు చేయాలని తెలంగాణ డీజీపీని కోరుతున్నాను. పోలీసుల్లో ఆత్మహత్యల ఆలోచనలు రాకుండా సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. పోలీస్ మిత్రులారా.. సమస్యలు ఏవైనప్పటికీ ఆత్మహత్యలు పరిష్కారం కాదు. ఎంతో కష్టపడి ఈ ఉద్యోగాలు సాధించారు. మీ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకండి. విలువైన జీవితాలను కోల్పోకండి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన మీరు ఆత్మస్థైర్యంతో విధులు నిర్వహిస్తేనే సమాజానికి భద్రత" అని హరీశ్ రావు అన్నారు.


ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
30 డిసెంబర్
2024





# చలికాలంలో ఇలా చేస్తే దగ్గు, జలుబు పరార్..

మారుతున్న వాతావరణం కారణంగా ప్రజలు అనేక రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. ముఖ్యంగా ఈ చలికాలంలో జలుబు, దగ్గు సమస్య అధికంగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలి వాతావరణం.. మధ్యాహ్నం సమయంలో పొడి వాతావరణం కారణంగా.. కాలుష్యం పెరిగిపోతుంది. ఈ విచిత్ర వాతావరణ పరిస్థితుల కారణంగా.. ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. చలికాలంలో ప్రధానంగా వచ్చే జలుబు, దగ్గు నుంచి ఉపశమనం పొందడానికి పురాతన కాలం నుంచి వంటింటి చిట్కాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పాటించడం ద్వారా దగ్గు, జలుబు సమస్య నుంచి ఈజీగా బయటపడొచ్చు. మరి ఆ వంటింటి చిట్కాలేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం..



**దగ్గు, జలుబు నుంచి ఉపశమనం పొందాలంటే..**

అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి జలుబు, దగ్గు లక్షణాలను తగ్గిస్తాయి. ఒక చెంచా తాజా అల్లం రసం తీసి అందులో తేనె కలపాలి. ఇది రోజుకు రెండు మూడు సార్లు తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, శ్లేష్మం నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఆయుర్వేదంలో తులసి, లవంగాల వాడకానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. తులసి ఆకులు, లవంగాలను నీటిలో మరిగించి టీ తయారు చేసుకుని తాగాలి. రుచి కోసం కొంచెం తేనెను కూడా కలుపుకోవచ్చు. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

ఆవిరి: ముక్కు దిబ్బడ, శ్లేష్మం సమస్యతో ఇబ్బందిపడేవారు.. ఆవిరి పట్టడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఇది అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుంది. వేడి నీటిలో యూకలిప్టస్ నూనె వేసి.. ఆవిరి పట్టాలి. ఇది ముక్కు దిబ్బద, జలుబు లక్షణాలను త్వరగా తగ్గిస్తుంది.

పసుపు: పసుపులో క్రిమినాశక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలిపి రాత్రి పడుకునే ముందు తాగాలి. ఇది శరీరాన్ని లోపలి నుండి వెచ్చగా ఉంచుతుంది. ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది.

నీటితో పుక్కిలించాలి: గోరువెచ్చని నీటిలో కాసింత ఉప్పు వేసి కలిపి.. ఆ నీటితో పుక్కిలించాలి. తద్వారా గొంతు నొప్పి, ఇన్‌ఫెక్షన్ నుంచి బయటపడటానికి ఉపయోగకరంగా ఉంటుంది. వాపును కూడా తగ్గిస్తుంది.

గమనిక: పైన పేర్కొన్న వివరాలు.. ఆరోగ్య నిపుణులు అందించిన సమాచారం మేరకు ఇవ్వడం జరిగింది. దీనిని ఆంధ్రజ్యోతి ధృవీకరించడం లేదు. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ముందుగా వైద్యులను సంప్రదించడం ఉత్తమం. వారి సలహాలను పాటించడం శ్రేయస్కరం.



# శీతాకాలం సమస్యలకు ఆయుర్వేద చిట్కాలు!

చలికాలంలో ఎన్ని జాగ్రత్తలు పాటించినా కొన్ని చిన్నపాటి సమస్యలు సమసిపోకుండా వేధిస్తూనే ఉంటాయి. వాటిని ఆయుర్వేద చిట్కాలతో అదుపుచేసే వీలుంది. అదెలాగంటే.....

పొడిచర్మం: పెరుగు, మజ్జిగ కలిపి చర్మానికి పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. కలబంద గుజ్జుకు చెంచా కాకరకాయ రసం చేర్చి, కలిపి ముఖానికి పూసుకుని రాత్రంతా అలాగే ఉంచుకోవాలి. పొద్దునే కడిగేసుకోవాలి.

పొడి జుట్టు: గుడ్డు పచ్చసొన, ఆలివ్ ఆయిల్ కలిపి వెంట్రుకలకు పట్టించి 20 నిమిషాల తర్వాత తలస్నానం చేసేయాలి. నీళ్లల శీకాకాయ, బ్రహ్మి కలిపి మిక్సీలో వేసి ముద్దగా చేసి, వెంట్రుకలు మాస్క్ వేయాలి. ఆరిన తర్వాత కడిగేసుకోవాలి.

పాదాల పగుళ్లు: అరటిపండు గుజ్జును పగుళ్లకు పట్టించి 10 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. రాత్రి పడుకునేముందు పాదాలకు వంటనూనె పట్టించి, సాక్స్ వేసుకోవాలి.

దగ్గు, జలుబు: నీళ్లలో జింజర్ రూట్ నానబెట్టి తాగాలి. ఆహారంలో అల్లం ఎక్కువగా వాడాలి. గొంతు నొప్పి, దగ్గు, జలుబు తగ్గడం కోసం పాలలో పసుపు కలుపుకుని రాత్రి పడుకునే ముందు తాగాలి.

కాళ్లవాపు: గ్లాసు నీళ్లలో ధనియాలు కలిపి నీళ్లు సగం అయ్యేవరకూ మరిగించాలి. ఇలా వాపు తగ్గేవరకూ ఆ నీళ్లను ప్రతిరోజూ తాగుతూ ఉండాలి. కాళ్లను నువ్వుల నూనెతో మర్దన చేస్తూ ఉండాలి.



# మునగ పూలు ఎంతో మేలు!

మునగ చెట్టు.. ఔషధాల గని. ఆయుర్వేదంలోనూ తిరుగులేనిది. మునగకాయలు, ఆకులేకాదు.. మునగ పువ్వుల్లోనూ అనేక ఔషధ గుణాలు ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. 'మునగపూల టీ'తో అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని అంటున్నారు. మునగపూలలో యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. వీటిని తీసుకోవడం ద్వారా.. శరీరానికి విటమిన్ ఎ, బి1, బి2, బి3, సితో పాటు కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా అందుతాయి.

**మునగపూల టీ..**

ముందుగా మునగపూలను కోసి.. వాటిని బాగా జల్లెడ పట్టించాలి. ఆ తర్వాత ఎండలో బాగా ఆరబెట్టి.. పొడిగా చేసుకోవాలి. ఈ పొడిని గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేసుకోవాలి. ఒక గ్లాసు నీటిలో ఒక టీస్పూన్ మునగపూల పొడిని కలిపి.. బాగా మరిగించాలి. అంతే! 'మునగపూల టీ' సిద్ధమైపోయినట్లే! దీన్ని నేరుగా అయినా.. రుచి కోసం ఒక టీ స్పూన్ తేనె కలుపుకొని అయినా తాగొచ్చు.

మునగ పువ్వుల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ అనే యాంటి ఆక్సిడెంట్.. శరీరంలో అదనపు కొవ్వును కరిగిస్తుంది. వీటిలో లభించే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్.. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయి. ఫలితంగా.. గుండె పనితీరు మెరుగవుతుంది.

'మునగపూల టీ' తీసుకోవడం వల్ల డిప్రెషన్, ఒత్తిడి దూరం అవుతాయి. నిద్రలేమి, నరాలవ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

బలహీనంగా ఉండే మహిళలను పీరియడ్స్ సమయంలో కడుపునొప్పి, తలనొప్పి వంటివి వేధిస్తాయి. వీటినుంచిబయటపడేందుకు.. మునగపూల టీని తాగొచ్చు. యూరిన్ ఇన్ఫెక్షన్లు, నెలసరి ఇన్ఫెక్షన్లపై మునగ టీ పోరాడుతుంది.

రోజుకు రెండుసార్లు ఈ టీని తాగితే.. కంటికి సంబంధించిన రోగాలు నయం అవుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

మధుమేహం, రక్తపోటును తగ్గించడంలోనూ మునగపూలు శక్తిమంతంగా పనిచేస్తాయి.

జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ మునగపూలు ముందుంటాయి. వీటిలో ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఇది కాలేయంలోని ఎంజైములను నియంత్రిస్తూ.. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడుతుంది.

# ఖాళీ కడుపుతో వర్కవుట్స్ చేస్తే..!



ఖాళీ కడుపుతో వర్కవుట్స్ చేస్తే, కడుపు దగ్గర పేరుకునే మొండి కొవ్వు కరుగుతుందనీ, త్వరగా బరువు తగ్గవచ్చని కొందరు అనుకుంటూ ఉంటారు. కానీ దీన్లో నిజమెంత?

ఖాళీ కడుపుతో చేసే వ్యాయామాన్ని ఫాస్టెస్ట్ కార్డియో అంటారు. ఇలా వ్యాయామం చేయడం వల్ల, శరీరం మనం తీసుకున్న ఆహారం నుంచి కాకుండా తనలో పేరుకుని ఉన్న కొవ్వు, కార్బొహైడ్రేట్ల నుంచి శక్తిని సంగ్రహిస్తుందని అనుకుంటాం. కానీ నిజానికి వ్యాయామానికి ముందు సరిపడా పోషకాలు తీసుకోవడం వల్ల సమర్థంగా వ్యాయామం చేయగలగడంతో పాటు కండర నష్టాన్ని అరికట్టగలుగుతాం. అలాగే వ్యాయామం చేయడానికి సరిపడా శక్తి సమకూరి అలసిపోకుండా ఉంటాం. కాబట్టి వ్యాయమానికి 45 నిమిషాల ముందు ఒక పండు లేదా స్నాక్ తీసుకోవడం తప్పనిసరి. మరీ ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన వాళ్లు తప్పనిసరిగా వ్యాయమానికి ముందు స్నాక్ తినాలి.

**ఎలాంటి ఆహారం?**

బ్లాక్ కాఫీ లేదా ప్రి వర్కవుట్ కెఫిన్‌ను ప్రివర్కవుట్ డ్రింక్‌గా తీసుకోవచ్చు. కార్బ్స్ తినాలనుకుంటే యాపిల్ లేదా పాలతో పాటు ఒక అరటిపండు లేదంటే కొన్ని డ్రై ఫ్రూట్స్ తీసుకోవచ్చు. తినడానికి ఇష్టపడని వాళ్లు, గ్లూకోజ్, లేదా ఎలక్ట్రొలైట్స్ కలిగిన నీళ్లను వ్యాయామానికి ముందు, వ్యాయామం చేస్తున్నప్పుడు తాగుతూ ఉండాలి.




# భారత్ ఎదుట భారీ లక్ష్యం

**రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 228/9**
**కంగారూల ఆధిక్యం 333**
**మెరిసిన బుమ్రా, సిరాజ్**







మెల్‌బోర్న్: జస్‌ప్రీత్ బుమ్రా వర్సెస్ ఆస్ట్రేలియాగా సాగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో భారత పేసర్ మరోసారి అద్భుత స్పెల్‌తో మ్యాజిక్ చేయడంతో బాక్సింగ్ డే టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో కంగారూలు తోకముడిచారు. బుమ్రా (4/56) మరోసారి విజృంభించగా మహ్మద్ సిరాజ్ (3/66) కూడా అతడికి అండగా నిలవడంతో రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 228/9 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు ఆధిక్యం 333 పరుగులుగా ఉంది. టాపార్డర్, మిడిలార్డర్ పనిపట్టిన బౌలర్లు.. ఆఖరి వరుస బ్యాటర్లు నాథన్ లియాన్ (54 బంతుల్లో 41 నాటౌట్, 5 ఫోర్లు), స్కాట్ బొలాండ్ (65 బంతుల్లో 10 నాటౌట్, 1 ఫోర్) వికెట్ తీయలేక చతికిలపడ్డారు. ఈ ఇద్దరూ పదో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించి ఆసీస్ ఆధిక్యాన్ని 330 పరుగుల మార్కును దాటించారు. ఆట ఆఖరిరోజైన సోమవారం ఈ ఇద్దరినీ త్వరగా ఔట్ చేసి ఛేదనను భారత్ ఏ మేరకు విజయవంతం చేయగలుగుతుందనేది ఆసక్తికరం. 2021లో ఇదే కంగారూలతో ప్రఖ్యాత గబ్బా వేదికగా జరిగిన చివరి టెస్టులో 329 పరుగులను ఛేదించి సిరీస్‌ను దక్కించుకున్న భారత్.. ఆ మ్యాజిక్‌ను రీక్రియేట్ చేస్తే మెల్‌బోర్న్ మన సొంతమవడం పక్కా! కానీ నాలుగో రోజు ఆటలో బంతి శరీరం మీదకు దూసుకురావడం, పిచ్‌పై అస్థిరమైన బౌన్స్‌తో చివరి రోజు ఆసీస్ పేస్ దళం నుంచి భారత బ్యాటర్లకు తిప్పలు తప్పకపోవచ్చు.

**బుమ్రా.. తగ్గేదేలే!**

140.4-38-384-29.. మరో మ్యాచ్ మిగిలున్న బీజీటీలో బుమ్రా బౌలింగ్ గణాంకాలివి. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో బుమ్రా దరిదాపుల్లో కూడా (17 వికెట్లతో కమిన్స్ రెండో స్థానం) ఏ బౌలర్ లేడు. సిరీస్ ఆరంభం నుంచి కంగారూలను ముప్పు తిప్పలు పెడుతున్న ఈ పేసు గుర్రం.. రెండో ఇన్నింగ్స్‌లోనూ హడలెత్తించాడు. నాలుగో రోజు ఆటలో ఓవర్ నైట్ స్కోరు 358/9కు మరో 11 పరుగులు జోడించి (369) భారత్ ఆలౌట్ అవగా తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 105 రన్స్ ఆధిక్యం దక్కింది. మూడో రోజు సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (114)ని లియాన్ ఔట్ చేసి భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ఆసీస్ ఏడో ఓవర్లోనే తొలి వికెట్ కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో మెరుపులు మెరిపించిన ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (8)ను బుమ్రా ఈసారి ఎక్కువసేపు క్రీజులో నిలువనీయలేదు. బుమ్రా వేసిన బంతిని డిఫెన్స్ ఆడబోయిన కొన్‌స్టాస్.. అది కాస్తా మిస్ అవడంతో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కొద్దిసేపు విసిగించిన ఉస్మాన్ ఖవాజా (21)ను సిరాజ్ బౌల్డ్ చేశాడు. లంచ్ తర్వాత ఫస్ట్ ఇన్నింగ్స్ సెంచరీ హీరో స్టీవ్ స్మిత్ (13) సైతం సిరాజ్ బౌలింగ్‌లోనే పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వరుస ఓవర్లో బుమ్రా ఆసీస్ మిడిలార్డర్ పనిపట్టాడు. 34వ ఓవర్ రెండో బంతికి ప్రమాదకర హెడ్ (1)ను వెనక్కిపంపిన అతడు.. ఆరో బంతికి మిచెల్ మార్ష్ (0)నూ ఔట్ చేశాడు. అదే ఊపులో తన తర్వాతి ఓవర్లో అలెక్స్ కేరీ (2)నూ బౌల్డ్ చేయడంతో ఆసీస్ 91/6తో నిలిచింది.

**ఆదుకున్న లబూషేన్, కమిన్స్**

భారత బౌలర్ల జోరుతో ఆసీస్ 150 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని భావించినా లబూషేన్ (139 బంతుల్లో 70, 3 ఫోర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ (41) అండగా అతడు భారత బౌలర్లను విసిగించాడు. సుమారు 20 ఓవర్ల పాటు వికెట్‌ను కాపాడుకున్న ఈ ద్వయం ఏడో వికెట్‌కు విలువైన 57 పరుగులు జోడించింది. ఈ క్రమంలో వీరిద్దరూ ఇచ్చిన క్యాచ్‌లను గల్లీలో యశస్వీ జైస్వాల్ వదిలేయడం భారత్‌ను దెబ్బకొట్టింది. అర్ధ సెంచరీ పూర్తిచేసి ప్రమాదకరంగా మారుతున్న లబూషేన్‌ను ఎట్టకేలకు సిరాజ్.. టీ విరామం తర్వాత వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. మిచెల్ స్టార్క్ (5) పంత్ త్రోకు రనౌట్ అవగా కమిన్స్‌ను జడేజా వెనక్కిపంపాడు.

**పట్టు విడిచారు..**

ప్రధాన బ్యాటర్లందరినీ త్వరగానే వెనక్కిపంపిన భారత బౌలర్లు ఆఖర్లో పట్టు విడిచారు. లియాన్, బొలాండ్ క్రీజులోకి వచ్చేసరికి ఆసీస్ ఆధిక్యం 278 పరుగులు. కానీ ఈ ఇద్దరూ పట్టుదలతో ఆడి ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని మరింత పెంచారు. వీరిని ఔట్ చేసేందుకు రోహిత్.. బౌలర్లను మార్చినా అనవసర షాట్లకు పోకుండా ఈ ఇద్దరూ జాగ్రత్తపడ్డారు. కొత్తబంతి తీసుకున్నాక బుమ్రా బౌలింగ్‌లో లియాన్.. స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చినా అది నోబాల్‌గా తేలడంతో అతడు బతికిపోయాడు.

**బుమ్రా @200**

టెస్టులలో బుమ్రా మరో ఘనతను అందుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో హెడ్‌ను ఔట్ చేసిన తర్వాత అతడు టెస్టులలో 200 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. తన కెరీర్‌లో 44వ టెస్టు ఆడుతున్న బుమ్రా.. అంతర్జాతీయ టెస్టులలో కనీసం 200 వికెట్లు తీసి సగటు 20 కంటే తక్కువ కలిగిన బౌలర్లలో మొదటివాడుగా నిలిచాడు. విండీస్ దిగ్గజాలు మాల్కమ్ మార్షల్ (20.94), జోయల్ గార్నర్ (20.97) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. బంతులపరంగా చూస్తే వకార్ యూనిస్ (7,725), డేల్ స్టెయిన్ (7,848), రబాడా (8,154) తర్వాత బుమ్రా (8,484) నాలుగో స్థానంలో ఉన్నాడు. భారత్ తరఫున టెస్టులలో 200 వికెట్ల మైలురాయిని దాటినవారిలో బుమ్రా 12 బౌలర్ కాగా అత్యంత వేగంగా ఈ ఘనత సాధించినవారిలో అశ్విన్ (37 టెస్టులలో) తర్వాత జడేజా(44)తో రెండో స్థానంలో సమానంగా నిలిచాడు.

# డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దక్షిణాఫ్రికా

## తొలి టెస్టులో పాక్‌పై ఉత్కంఠ విజయం




సెంచూరియన్: వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 సైకిల్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్ చేరింది. స్వదేశంలో పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో సఫారీలు థ్రిల్లింగ్ విక్టరీ సాధించి ఈ టోర్నీలో సగర్వంగా ఫైనల్ పోరుకు అర్హత సాధించారు. సెంచూరియన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 148 పరుగుల ఛేదనలో భాగంగా ఓవర్ నైట్ స్కోరు 27/3తో ఐదో రోజు ఆట ఆరంభించిన సౌతాఫ్రికా.. ఒకదశలో 95/4తో పటిష్ట స్థితిలోనే నిలిచింది. కానీ ఐదు పరుగుల వ్యవధిలో ఆ జట్టు ఏకంగా 4 వికెట్లు కోల్పోవడంతో ఒక్కసారిగా పాకిస్థాన్ గెలుపు రేసులోకి వచ్చింది. మహ్మద్ అబ్బాస్ (6/54) అద్భుత బౌలింగ్‌తో సఫారీలను ఆందోళనకు గురిచేశాడు. కానీ లోయరార్డర్‌లో అనుభవజ్ఞుడైన కగిసో రబాడా (26 బంతుల్లో 31 నాటౌట్, 5 ఫోర్లు), మార్కో యాన్సెన్ (24 బంతుల్లో 16 నాటౌట్, 3 ఫోర్లు) దక్షిణాఫ్రికాను (150/8) విజయతీరాలకు చేర్చారు. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించడం ఆ జట్టుకు ఇదే తొలిసారి. ఈ సైకిల్‌లో మరో మ్యాచ్ ఆడాల్సి ఉన్నప్పటికీ బవుమా సేన.. 66.67 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. సఫారీలు లార్డ్స్‌కు టికెట్ బుక్ చేసుకున్న నేపథ్యంలో రెండో జట్టు ఏదని సర్వత్రా ఆసక్తి నెలకొంది. పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా (58.89 శాతం), భారత్ (55.88 శాతం) వంసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

## వరల్డ్ ర్యాపిడ్ చెస్ విజేత హంపి

న్యూయార్క్: భారత స్టార్ చెస్ క్రీడాకారిణి, గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. టోర్నీలో 11 పాయింట్లకు గాను ఆమె 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకోవడంతో విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన 11వ రౌండ్‌లో హంపి.. ఇరెనె సుకందర్ (ఇండోనేషియా)ను ఓడించడంతో టైటిల్ నెగ్గింది. ఈ టోర్నీని గెలుచుకోవడం హంపికి ఇది రెండోసారి. 2019లో జార్జియాలో నిర్వహించిన టోర్నీలోనూ హంపి సత్తా చాటింది. తద్వారా వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను ఒకటి కంటే ఎక్కువసార్లు గెలిచిన ప్లేయర్లలో చైనా క్రీడాకారిణి జు వెంజున్ తర్వాతి స్థానంలో నిలిచింది. తొలి గేమ్‌లో ఓడిపోయినప్పటికీ హంపి తర్వాత పుంజుకుని టైటిల్‌ను దక్కించుకుంది. భారత్ నుంచి ద్రోణవల్లి హారిక (8 పాయింట్లు) ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో రష్యాకు చెందిన 18 ఏండ్ల కుర్రాడు వోలోదర్ ముర్జిన్ టైటిల్ గెలిచాడు. 10 పాయింట్లతో అతడు చాంపియన్‌గా అవతరించాడు. ఆరంభంలో వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన యువ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఆఖర్లో తడబడి 9 పాయింట్లతో ఐదో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది.



## హర్యానాదే ట్రోఫీ

**పీకేఎల్ ఫైనల్‌లో పాట్నా పైరేట్స్‌పై గెలుపు**




పూణె: ప్రో కబడ్డీ లీగ్-11వ సీజన్ టైటిల్‌ను హర్యానా స్టీలర్స్ దక్కించుకుంది. సీజన్ ఆరంభం నుంచి టేబుల్ టాపర్‌గా ఉంటూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆ జట్టు.. టైటిల్ పోరులో 32-23తో పాట్నా పైరేట్స్‌ను మట్టికరిపించి ఈ టోర్నీలో తొలిసారి ట్రోఫీని సాధించింది. గతేడాది ఫైనల్‌లో పూణెరి పల్టన్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన హర్యానా ఈసారి మాత్రం పట్టు విడవకుండా టోర్నీ ఆసాంతం అదరగొట్టి తమ కప్ కలను సొంతం చేసుకుంది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 15-12తో ఆధిక్యంలో ఉన్న హర్యానా.. సెకండాఫ్‌లో మరింత జోరు పెంచింది. హర్యానా తరఫున రైడర్ శివమ్ పటారె 9 పాయింట్లతో సత్తా చాటగా ఆల్‌రౌండర్ షాడ్లోయ్ (7), వినయ్ (6) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.



## కిస్సిక్ బ్యూటీ అందాల రైడ్

రాఘవేంద్రరావు కొత్త పెళ్లి సందడి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ శ్రీలీల. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచినా ధమాకా సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. రవితేజతో నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. ఈ ఏడాదిలో మహేష్ బాబుతో కలిసి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో గుంటూరు కారం సినిమాలో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఫ్లాప్ అయినా శ్రీలీల జోరు మాత్రం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాదిలో పుష్ప 2 లో ఐటెం సాంగ్ చేసి దేశం మొత్తం కిస్సిక్ బ్యూటీ అనిపించుకుంది.

తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. శ్రీలీల నటిగా తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ సినిమాలు చేస్తున్న కారణంగా ఎక్కువగా ప్రయాణాలు చేస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒక వాహనంలో ప్రయాణిస్తున్న శ్రీలీల అందాల ఆరబోత చేయడంతో పాటు క్యూట్ ఎక్స్ ప్రెషన్స్‌తో అందరిని ఆకట్టుకుంటూ ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. తన అందంతో గతంలోనే ఆకట్టుకున్న శ్రీలీల మరోసారి తన క్యూట్ ఫోటోలతో కన్నుల విందు చేసింది అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.



## న్యూ ఇయర్.. న్యూ మూవీస్.. రకుల్ బౌన్స్ బ్యాక్?

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ గురించి అందరికీ తెలిసిందే. ఒకప్పుడు టాలీవుడ్ సినీ ఇండస్ట్రీని ఓ రేంజ్ లో ఏలిన ముద్దుగుమ్మ తన యాక్టింగ్ తో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. దాదాపు తెలుగులో అందరి స్టార్ హీరోలతో నటించి మెప్పించారు. బాక్సాఫీస్ వద్ద అనేక హిట్స్ అందుకుని సత్తా చాటారు రకుల్.

అయితే రకుల్.. తెలుగు సినిమా చేసి చాలా గ్యాప్ వచ్చేసింది. మూడేళ్లు దాటిపోయింది. చివరగా 2021లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కొండపొలం మూవీలో కనిపించారు. ఆ తర్వాత ఒక్క తెలుగు చిత్రంలో కూడా సందడి చేయలేదు. ఇప్పుడు బాలీవుడ్ లో బిజీగా గడుపుతూ వరుస చిత్రాలు చేస్తున్నారు. కానీ 2024లో రకుల్.. తన సినిమాలతో మెప్పించలేకపోయారు. అటు నార్త్.. ఇటు సౌత్.. ఎక్కడా కూడా ఆమె సౌండ్ వినిపించలేదు. కోలీవుడ్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన భారతీయుడు-2 మూవీతో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కానీ అనుకున్న స్థాయిలో హిట్ అందుకోలేకపోయారు. కోలీవుడ్ మూవీ అయలాన్ కూడా నిరాశపరిచింది. అయితే ఆ రెండు సినిమాలు కూడా ఎప్పుడో రిలీజ్ కావాల్సి ఉండగా.. అనేక కారణాల వల్ల వాయిదా పడ్డాయి. చివరకు 2024లో రిలీజ్ అయ్యాయి. కానీ రకుల్ కు నిరాశ ఎదురయ్యేలా చేశాయి. అయితే ప్రస్తుతం నార్త్ లో మూడు సినిమాల్లో నటిస్తున్నారు రకుల్ ప్రీత్ సింగ్.

## మాయలో పడిపోవాల్సిందే

'అలియాభట్ ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.' అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన 'జిగ్రా' సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం 'జిగ్రా' వల్ల లభించిందని ఆయన అన్నారు. ' 'జిగ్రా' సీరియస్ సబ్జెక్ట్. ఆ కథలో కామెడీ లేదు. కానీ సెట్ అంతా ఎప్పుడు కామెడీగా ఉండేది. కారణం అలియాభట్. తను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఓ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం అలియా స్పెషాలిటీ. ఆమెతో ఒక్కసారి పనిచేశాక.. మళ్లీ ఇంకొకరితో పనిచేయడం చాలా కష్టం. ఎందుకంటే తనే గుర్తుకొస్తుంటుంది..' అంటూ మాట్లాడారు వాసన్‌బాలా. దీనిబట్టి అలియా మాయ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986